నోడల్ అధికారుల పాత్ర కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- ఎన్నికల విధులపై సమీక్షా సమావేశం
- పాల్గొన్న ఎస్పీ, అదనపు కలెక్టర్, నోడల్ అధికారులు

ఆసిఫాబాద్,మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకమైనదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో గల కలెక్టర్ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేశ్ కుమార్ తో కలిసి నోడల్ అధికారులకు ఎన్నికల నిర్వహణ, విధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో 356 పోలింగ్ కేంద్రాలు ఉండగా సహాయక పోలింగ్ కేంద్రాలతో మొత్తంగా 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ , వీడియో సర్వేలెన్స్ , వీడియో పరిశీలన, సహాయ ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎంసీఎంసీ, కంట్రోల్ రూమ్ , ఖర్చుల పర్యవేక్షణ కమిటీలు, ఎన్నికల విభాగాల అధికారులతో పాటు అదనపు సిబ్బందిని నియమించామని తెలిపారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఫాంలు, బ్యాలెట్ పత్రాలు, చెరగని ఇంకు, ఎన్నికల సామగ్రి పంపిణీ చేయాలన్నారు. రవాణా అవసరాలకు ఇతర జిల్లాల నుంచి సర్దుబాటు చేసుకోవాలన్నారు. సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు అనుగుణంగా జిల్లా వెబ్ సైట్ నవీకరణ, సీఐటీ పనితీరు, సాఫ్ట్ వేర్ , హార్డ్ వేర్ పర్యవేక్షణ, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్వీప్‌లో భాగంగా ప్రణాళిక, సర్వే, ఓటర్ల నమోదు పెంచేందుకు స్వీప్ డాక్యుమెంట్ చేయాలని తెలిపారు. రక్షణ చర్యల నివేదిక, బలగాల కేటాయింపు, శిక్షణ, బస, రవాణా, క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలను అంచనా వేసి రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల లభ్యత, పంపిణీ, మొదటి స్థాయి తనిఖీ, ర్యాండమైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, మీడియా కార్యకలాపాలపై ప్రతి రోజూ నివేదికను రూపొందించాలన్నారు. సీ-విజిల్ ద్వారా ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని ఓటరు హెల్ప్ లైన్ 1950, కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08733-279033 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్, ఎన్నికల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తప్పినపోయిన బాలికను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కలెక్టర్, ఎస్పీ, సఖీ కేంద్రం నిర్వాహకులు

తప్పిపోయిన బాలిక అప్పగింత

తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ లోని బలియా గ్రామానికి చెందిన సంజన బే తప్పిపోయి జిల్లాలోని కాగజ్ నగర్ రైల్వే స్టేషన్‌లో ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందికి ఈ నెల 17న దొరికింది. బాలికకు సఖి కేంద్రంలో ఆశ్రయం కల్పించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, ఎస్పీ సురేశ్ కుమార్‌తో కలిసి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపులు, గృహహింస, ఈవ్ టీజింగ్ బాధిత బాలికలు, యువతులు, మహిళలకు సఖి కేంద్రంలో ఆశ్రయం కల్పించి అవసరమైన న్యాయ సేవలు అందించడం జరుగుతుందన్నారు. సఖి కేంద్రంలో న్యాయ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో మహిళలకు ఇబ్బందులు లేకుండా చూస్తారని వివరించారు. కార్యక్రమంలో సఖి కేంద్రం సహాయ సంచాలకురాలు మమత, కౌన్సిలర్ సుమలత, శ్రీనిధి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

కల్వాడలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ అల్లం రాంబాబు

దహెగాం, మార్చి 20: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు సూచించారు. మండలంలోని కల్వాడ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును బుధవారం ఆయన సందర్శించారు. చెక్ పోస్టు వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కల్వాడ, పీపీరావు కాలనీల్లో గ్రామస్తులతో సమావేశమై ఎన్నికలపై అవగాహన కలిపించారు. అర్హత కలిగిన వారందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆగిపోయిన పనులు ప్రారంభించాలి

రెబ్బెనలో డ్రైనేజీని పరిశీలిస్తున్న నేషనల్ హైవే అధికారులు

రెబ్బెన, మార్చి 20: మండల కేంద్రంలో నిలిచిపోయిన నేషనల్ హైవే పనులు వెంటనే ప్రారంభించాలఅని రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్ హైవే అధికారులకు విన్నవించారు. బుధవారం రెబ్బెనకు వచ్చిన నేషనల్ హైవే రెసిడెంట్ ఇంజినీర్ అంజాద్‌ను కలిసి పలు సమస్యలు వివరించారు. సర్వీస్ రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మించకపోవడంతో రాత్రి కురిసిన వర్షానికి నీరంతా ఇండ్లలోకి చేరిందని, అప్రోచ్ రోడ్‌లో డాంబర్ వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ దవాఖాన వద్ద రోడ్డు ఎత్తు ఎక్కువగా ఉండడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలు వెలంటనే పరిష్కరించాలని విన్నవించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హైవే అధికారులు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపీటీసీ పెసరి మధునయ్య, ఇంజినీర్ అంజాద్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో వెంచర్‌ను ఆపాలి

కౌటాల, మార్చి 20: మండలంలోని శిర్నా గ్రామ శివారులోని సర్వే నంబర్ 186(పీ పీ)లో అక్రమంగా చేస్తున్న వెంచర్‌ను ఆపాలని ఆ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిర్పూర్ గ్రామానికి చెందిన కమలాకర్ గోపాల్‌రావు ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసి, ప్లాట్లు అమ్మకానికి పెట్టినట్లు ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో అక్రమ వెంచర్‌తో పాటు అమ్మకానికి పెట్టిన గోపాల్ రావుపై చర్యలు తీసుకుని, ఆ స్థలాన్ని శిర్నా గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ క్రీడా ప్రాంగణానికి కేటాయించాలని కోరారు. ఇక్కడ గ్రామస్తులు శంకర్, పెద్దల బీరయ్య, జగ్గయ్య, తిరుపతి, మల్లేశ్, వాను, సత్తన్న, మృత్యుంజయ్ ఉన్నారు.

కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

మందమర్రి, మార్చి 20: సింగరేణి మందమర్రి ఏరియాలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, క్లీనర్లకు వేతనాలను పెంచి సమస్యలను పరిష్కరించాలని కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి పౌల్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డ్రైవర్లకు కనీస వేతనం రూ.32 వేలకు క్లీనర్లకు రూ.18 వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ బోనస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ప్రతి నెలా 10వ తేదీనే వేతనాలు చెల్లించాలన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి వేతనాలు పెంచి, సమస్యలను పరిష్కరించనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులతో పాటు కార్మికులు కుమార్, శ్రీశైలం, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

సీసీసీ నస్పూర్, మార్చి 20: లోక్‌సభ ఎన్నిక ల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంచిర్యాల కలెక్టర్ సంతోష్ కోరారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించడానికి బుధవారం నస్పూర్‌లో ర్యాలీ నిర్వహించారు. సీసీసీ కార్నర్ వద్ద ప్రతిజ్ఞ చే సిన అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చే సుకోవాలని కోరారు. స్వీప్‌లో భాగంగా వాక్ టూ పోలింగ్ బూత్, ఓటు వినియోగం, ప్రా ముఖ్యతను తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారుల ఆటాపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆర్డీవో వడాల రాములు, స్వీప్ సమన్వయకర్త రాంచందర్, నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సమత, సీఐ ఆకుల అశోక్, ఎస్ఐ రవికుమార్, మున్సిపల్ రెవెన్యూ అధికారి కే సతీశ్, మెప్మా ఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జైపూర్, మార్చి 20: జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందారం వద్ద మంగళవారం రాత్రి గోదావరిఖని నుంచి చెన్నూర్ మీదుగా మహారాష్ట్ర తరలిస్తున్న 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ట్రాలీలో గోదావరిఖని నుంచి మహారాష్ట్ర తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఇందారం వద్ద మాటు వేసి పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ వారికి అప్పగించినట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కాగజ్‌నగర్: పోషకాహార ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, గర్భిణులు

రెబ్బెన: కొండపల్లిలో పోషణ్ పక్షోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

కాగజ్‌నగర్, మార్చి 20: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని జైభీం కాలనీ, ఇందిరానగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతం, 6 నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ఐసీడీఎస్ లక్ష్యమన్నారు. తల్లిపాలు, చిరుధాన్యాలపై, పౌష్టికాహారంపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో హెచ్‌పీఎన్ పుష్పలత, ఏఎన్ఎం రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు త్రివేణి, రాణి, ఆశ వర్కర్లు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లిలో పోషణ పక్షం

రెబ్బెన, మార్చి 20: కొండపల్లి గ్రామంలో బుధవారం పోషకాహారంపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిషోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అటపాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి, పంచాయతీ కార్యదర్శి అక్బర్ అలీ, అంగన్‌వాడీ టీచర్లు సంతోషి, రాజేశ్వరి, ఏఎన్ఎం పద్మ తదితరులు ఉన్నారు.

కాపువాడలో రేణుకా ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన

విగ్రహాల ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

కాగజ్‌నగర్, మార్చి 20: కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో నూతనంగా నిర్మించిన శ్రీ ఎల్లమ్మ రేణుకామాత-నల్ల పోచమ్మ ఆలయంలో బుధవారం విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదివరాహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కమాన్‌పూర్, మార్చి 20: మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆదివరాహ స్వామి దేవస్థానంలో సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకుడు దండె లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గోలేటి సీహెచ్‌పీలో ఫిట్ కమిటీ నియామక పత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన, మార్చి 20: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఫిట్ కమిటీ గోలేటి బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో ఏఐటీయూసీ గోలేటి సీహెచ్‌పీ ఫిట్ కమిటీ నియామక పత్రాన్ని సీహెచ్‌పీ డీజీఎం విశ్వనాథ్‌కు అందించారు. అనంతరం కమిటీ సభ్యులను పరిచయం చేసుకుని మాట్లాడారు.

గోలేటి సీహెచ్‌పీ ఫిట్ కమిటీ..

ఫిట్ కార్యదర్శిగా ఎంబడి రామయ్య, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శిగా ఎల్తూరి శ్రీనివాస్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా అదాం సమీ, ఏ-రిలే షిఫ్ట్ ఇనాచార్జిగా సురేశ్ కోరి, బీ-రిలే షిఫ్ట్ ఇనాచార్జిగా చంద్రయ్య, సీ-రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిగా కాసి శ్రీనివాస్, మైన్స్ కమిటీ సభ్యులుగా ఎంబడి రామయ్య, గజ్జల రాజయ్య, ఎల్తూరి శ్రీనివాస్, మేకల తిరుపతి, అమర్‌సింగ్, సమ్మయ్య, సురేశ్ కోరి, బోగారపు వరలక్ష్మి, సేఫ్టీ కమిటీ సభ్యులుగా సంతోష్‌కుమార్, రామగిరి శ్రీనివాస్, సభ్యులుగా ఎంబడి రామయ్య, అదాం సమీ, మంతెన వేణుగోపాల్, మహంకాళి తిరుపతి, కుసుమ శ్రీనివాస్, కాసి శ్రీనివాస్, వీరస్వామి నియమితులయ్యారు.

వెంకన్న జాతరలో కబడ్డీ పోటీలు ప్రారంభం

క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎంపీపీ పెందోర్ మోతీరాం, కమిటీ నాయకులు

కెరమెరి, మార్చి 20: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఎంపీపీ పెందోర్ మోతీరాం, జాతర కమిటీ నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబడ్డీలో గెలుపోటములను చూడకుండా, స్నేహపూర్వకంగా ఆడాలన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే జాతరలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్‌రావ్, కమిటీ నాయకులు కోవ దేవ్‌రావ్, దండుగుల శ్రీనివాస్, తాలీంఖాన్, పెందోర్ శ్రీనివాస్, సిడాం ధర్ము, ఎల్లప్ప పాల్గొన్నారు.

సివిల్ అధికారికి సన్మానం

గోలేటి జీఎం కార్యాలయంలో సివిల్ ఎస్ఈ షేక్‌మదీనాబాషాను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన, మార్చి 20: బెల్లంపల్లి ఏరియాకు బదిలీ పై వచ్చిన సివిల్ ఎస్ఈ షేక్ మదీనాబాషాను బుధవారం గోలేటి జీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, అనంద్, సివిల్ డిపార్టుమెంట్ ఫిట్ కార్యదర్శి గడ్డం రమేశ్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి అజ్మీరా గణేశ్, నాయకులు యుగంధర్, రవి, సురేశ్ కోరి, పుట్ట అంజయ్య, రాచర్ల రమేశ్, నాడెం రవి ఉన్నారు.

కాంట్రాక్టర్స్ ఆధ్వర్యంలో ..

సివిల్ ఎస్ఈ షేక్ మదీనా బాషాను బెల్లంపల్లి ఏరియా లోని సివిల్ కాంట్రాక్టర్లు మార్యద పూర్వకంగా కలిసి సన్మానం చేసినట్లు సింగరేణి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకల మొండయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ ఈఈలు రాజేంద్రప్రసాద్, మనోజ్, కాంట్రాక్టర్లు గోపికృష్ణారెడ్డి, పైడిధర్, రాజు, మహీధర్‌గౌడ్, నర్సాగౌడ్, పరకాల సాగర్‌గౌడ్, శ్రీనివాస్, నర్సింహ ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్, మార్చి 20: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని గురుకుల ప్రిన్సిపాల్ ఉటూరి శ్రీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

న్యూ కాలనీలో చోరీ

కాగజ్‌నగర్, మార్చి 20: కాగజ్‌నగర్ పట్టణంలోని న్యూ కాలనీలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. న్యూకాలనీని చెందిన ఈర్ల సతీశ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపు తాళాలు తీసి, బీరువా పగులగొట్టి తులం బంగారం, రూ.10,500 దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇక్కడ పట్టణ ఎస్ఐ అంజయ్య, పోలీసులు ఉన్నారు.

అన్నదాన సత్రంలో ప్రత్యేక హోమం

కాగజ్‌నగర్, మార్చి 20: కాగజ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని కోనేరు చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొద్ది రోజులుగా నిలిచిపోయిన సత్రం తిరిగి బుధవారం ప్రారంభించారు. వేద పండితుడు కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కోనేరు చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఉన్నారు.

పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఆసిఫాబాద్, మార్చి 20: రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో నిర్వహించే క్రోధినామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శిరీశ్ శర్మ, శ్రీనివాస శర్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్య అతిథులుగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర్ వేణుగోపాల్‌రావు, కమిషనర్ హనుమంత్‌రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం, అర్చకుల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని డీడీఎన్ అర్చకులు పూర్తి స్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, మార్చి 20: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపురం మహేశ్, పార్వతి రాజశేఖర్ కోరారు. మంగళవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీపీఆర్‌వో సంపత్‌ను సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యుడు సురేందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నీలి సతీశ్, కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందిస్తూ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జర్నలిస్టులతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ సంఘం కోశాధికారి కృష్ణ మోహన్‌గౌడ్, సభ్యులు నాగేందర్, ఎండీ ఇసాక్, విష్ణుగౌడ్, జలీల్, దాసరి లక్ష్మణ్, సంతోష్, సదాశివ్ పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దుర్గాపూర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి సాగర్

రెబ్బెన, మార్చి 20: పశు సంపద కలిగిన ప్రతి ఒక్కరూ పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రెబ్బెన పశు వైద్యాధికారి సాగర్ సూచించారు. గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని దుర్గాపూర్, అమీన్‌గూడ, గోండుగూడ గ్రామాల్లో బుధవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా 214 ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చాలి

గోలేటి జీఎం కార్యాలయంలో ఆన్‌లైన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెబ్బెన, మార్చి 20: అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని డీజీఎం(ఐటీ) హరిశంకర్‌రావు, బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం మచ్చగిరి నరేందర్ సూచించారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో బుధవారం ఏరియాలోని అన్ని విభాగాల ఉద్యోగులకు ఐఎంఈ, పీఎంఈ, వీటీసీ శిక్షణ వివరాలు ఆన్‌లైన్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఇక్కడ పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం వేణు, సీనియర్ పీవో ప్రశాంత్, సివిల్ ఈఈలు రాజేంద్రప్రసాద్, మనోజ్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ ముజీబ్, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎం లో చోరీకి యత్నం

రెబ్బెన, మార్చి 20: గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సమయంలో ఏటీఎంలోకి ప్రవేశించిన అపరిచితుడు ఏటీఎంను పగులకొట్టి డబ్బులు తీసుకెళ్లడానికి యత్నించగా అలారం మోగడం, అటు వైపు వచ్చిన పెట్రోకార్ పోలీసులను గమనించి అక్కడి నుంచి పారిపోయాడు. ఏటీఎం వద్ద ఉన్న సీసీ టీవీ పుటేజీ పరిశీలించి నిందితుడి కోసం గాలింపు చర్యలు మమ్మురం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.